క్లుప్తంగా

'వికాస్ ఆరోగ్య దీపిక'కు విరాళం



నెల్లూరు(బృందావనం): వికాస్ ఆరోగ్య దీపిక పథకానికి రూ.పది వేల విరాళాన్ని హరిరాజా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వికాస్ ప్రజాహిత సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, 14వ డివిజన్ కార్పొరేటర్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. పేదలకు మందులను ఉచితంగా అందజేసే కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలను తెలియజేశారు. వైద్య శిబిరాన్ని డాక్టర్ సహజరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8.30కు నిర్వహించనున్నామని చెప్పారు.

రాజరాజేశ్వరి దేవస్థాన ఈఓగా శ్రీనివాసులురెడ్డి



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థాన ఇన్‌చార్జి ఈఓగా వెంకటశ్రీనివాసులురెడ్డి బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. వెంకటగిరిలోని పోలేరమ్మ దేవస్థాన ఈఓగా విధులు నిర్వర్తిస్తున్న ఈయన ఇన్‌చార్జిగా బాధ్యతలను చేపట్టారు. వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఈఓ గిరికృష్ణ నుంచి బాధ్యతలను స్వీకరించారు.

బైక్ చోరీ

నెల్లూరు సిటీ: బైక్ చోరీకి గురైన ఘటనపై వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసుల సమాచారం మేరకు.. శెట్టిగుంట రోడ్డులోని బట్టీలవారివీధికి చెందిన నరేంద్ర కరెంటాఫీస్ సెంటర్‌లోని అభినవ్ మోటార్స్‌లో ఫైనాన్సియర్‌గా ఏడాది నుంచి విధులు నిర్వర్తిస్తున్నారు. రోజూ బైక్‌లో వచ్చి కార్యాలయ ఎదుట నిలిపేవారు. ఈ క్రమంలో ఈ నెల ఏడున తన బైక్‌ను నిలిపి విధులకెళ్లారు. అనంతరం తిరిగొచ్చేసరికి బైక్ అదృశ్యమైంది. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ల చోరీ కేసులో బాలుడి అరెస్ట్

నెల్లూరు సిటీ: సెల్‌ఫోన్లను చోరీ చేసిన కేసుల్లో బాలుడ్ని సంతపేట పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. నగరానికి చెందిన ఓ బాలుడు రెండు సెల్‌ఫోన్లను చోరీ చేశారని పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో అరెస్ట్ చేసి ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

కేన్సర్ ఆస్పత్రికి విరాళం



నెల్లూరు (అర్బన్): రెడ్‌క్రాస్ కేన్సర్ ఆస్పత్రికి రూ.ఐదు లక్షల విరాళాన్ని దాతలు శుక్రవారం అందజేశారు. నగరానికి చెందిన మాలకొండయ్య, మహాలక్ష్మి దంపతులు వారి కుమారుడు యుగంధర్ జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో కలెక్టర్ చక్రధర్‌బాబుకు ఆయన క్యాంప్ కార్యాలయంలో ఇచ్చారు. రెడ్‌క్రాస్ ఎమ్సీ మెంబర్ రంగయ్యనాయుడు, రెడ్‌క్రాస్ కేన్సర్ హాస్పిటల్ మెడికల్ చీఫ్ లక్ష్మి, మెడికల్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, ఏఓ జుబేదా, సామాజిక కార్యకర్త సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భారీగా పన్నుల వసూలు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో పన్నులు భారీగా వసూలయ్యాయి. రూ.80 కోట్ల పన్నులను వసూలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా, రూ.78.75 కోట్ల మేర వసూలయ్యాయి. వడ్డీ మాఫీ అవకాశాన్ని కల్పించిన 16 రోజుల్లో రూ.16,45,41,300 మేర వసూలు చేశారు. శుక్రవారం ఒక్క రోజే రూ.4.02 కోట్లను బకాయిదారులు చెల్లించారు. వడ్డీ మాఫీ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకున్నారని డిప్యూటీ కమిషనర్ చెన్నుడు తెలిపారు.

వ్యాఖ్యలను జేపీ ఉపసంహరించుకోవాలి

నెల్లూరు(అర్బన్): ఉద్యోగుల పింఛన్లపై అనుచితంగా మాట్లాడిన మాజీ ఐఏఎస్ జయప్రకాష్ నారాయణ తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగులకు పింఛన్ ఎందుకంటూ ఆయన మాట్లాడటం తగదని హితవు పలికారు. ఆయన వ్యాఖ్యలను ఖండించారు.

త్వరలో రోడ్డు నిర్మాణం పూర్తి

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్



రోడ్డు పనులను పరిశీలిస్తున్న అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగర పరిధిలోని మైపాడు రోడ్డులో చేపట్టిన నాలుగు లేన్ల రహదారి నిర్మాణ పనులను త్వరలో పూర్తి చేస్తామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మైపాడు గేట్ సెంటర్ వద్ద జరుగుతున్న నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు 50 శాతం పనులు పూర్తయ్యాయని, రానున్న మూడు నెలల్లో మిగిలిన పనులను పూర్తి చేస్తామని వెల్లడించారు. రోడ్డు పూర్తయ్యాక ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య చాలా వరకు తగ్గుతుందని తెలిపారు. నిబంధనల మేరకు గృహాలను తొలగించి రోడ్డు పనులను చేపట్టామని, సహకరించిన వారికి కృతజ్ఞతలను తెలియజేశారు. ఎలాంటి రాజీ లేకుండా నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలనడం తప్పా..?

అంబాపురంలోని ఓ స్థల వ్యవహారం కోర్టులో పెండింగ్ ఉందని, ఇక్కడ గుడిసెలు వేయడం మంచి పద్ధతి కాదని తాను చెప్పానన్నారు. ఇలాంటి ఆక్రమణలను ప్రోత్సహించకుండా తొలగించాలని అధికారులకు 20 రోజుల క్రితం సూచించామని వివరించారు. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన నేపథ్యంలో చుట్టూ కంచె వేసి బోర్డును పెట్టాలని చెప్పానన్నారు. భూములను ఆక్రమించకుండా బోర్డు పెట్టాలని చెప్పినందుకు గానూ తానేదో దళితులకు అన్యాయం చేస్తున్నానంటూ ఏబీఎన్‌లో కథనాలను ప్రసారం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ఆక్రమించిన వంద కుటుంబాలకు చెందిన దళితులకు నిజంగా ఇళ్ల స్థలాల్లేవని పేర్లు ఇస్తే వారికి అందజేసే బాధ్యతను తాను తీసుకుంటానని చెప్పారు. కార్పొరేషన్ పరిధిలో దాదాపు 30 వేల పేద కుటుంబాలకు స్థలాలను ప్రభుత్వమిచ్చిందని, ఇప్పటికీ ఎవరికైనా లేకపోతే సచివాలయం, తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జేసీ, ఎస్పీ చొరవతో సమస్య పరిష్కారమైందని, వీరికి కృతజ్ఞతలను తెలియజేశారు. కార్పొరేటర్లు రవిచంద్ర, అశ్విని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత వెంకటేశ్వర్లురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎవరొచ్చినా భయపడేది లేదు



సమస్యలను ఆరాతీస్తున్న ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఎన్నికలకు ముందు రూ.100 కోట్లతో ఎవరొచ్చినా భయపడేది లేదని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని తొమ్మిదో డివిజన్లో గల బంగ్లాతోట, యనమలపాళెం, తదితర ప్రాంతాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించిన అనంతరం ఆయన మాట్లాడారు. నెల్లూరు నగర నియోజకవర్గం నుంచి ఒకాయన పోటీ చేస్తారని ఓ పత్రికలో వార్త వచ్చిందని, నాలుగేళ్ల పాటు ప్రజలు ఎలా ఉన్నారో ఆయన కనీసం పట్టించుకోలేదని విమర్శించారు. కోవిడ్ సమయంలో ఎక్కడున్నారో తెలియని సదరు వ్యక్తి ఇప్పుడు పోటీ చేస్తానంటే ఎవరు లెక్కచేస్తారని ప్రశ్నించారు. ప్రజల్లో తిరుగుతామని.. అనిల్‌కుమార్‌ను ఓడిస్తామని వారు చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. రానున్న ఎన్నికల తర్వాత తానే ఎమ్మెల్యేనంటూ ఓ వ్యక్తి హడావుడి చేశారని, ప్రస్తుతం వేరే అభ్యర్థి అని తెలిశాక ఏమి చేస్తున్నారో అర్థం కావడంలేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ఎవరు పోటీకి వచ్చినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున తాను సిద్ధంగా ఉన్నానని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో.. నగర ప్రజల ఆశీస్సులతో మరోసారి గెలుపొందుతానని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ డివిజన్ ఇన్‌చార్జి శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ గల కళాకారులను ఆదరించాలి



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): ప్రతిభ గల కళాకారులతో రూపొందుతున్న సందేశాత్మక చిత్రాలను ఆదరించాలని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. పురమందిరంలో ఆదివారం నిర్వహించనున్న మహిషాసురుడు ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు సంబంధించిన బ్రోచర్లను గాంధీబొమ్మ సమీపంలోని అమరావతి చాంబర్స్‌లో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. నెల్లూరు పరిసరాల్లో మహిషాసురుడు చిత్ర షూటింగ్‌ను నిర్వహించారని తెలిపారు. దర్శకుడు రవికుమార్, హరిబాబు, భాస్కర్, సింహపురి మూవీ అసోసియేషన్ సభ్యులు జనార్దన్, రెమో, బాలు, నాగేంద్ర, స్వరూప, విజయహరిణి, లిఖిత, రాజు, చిట్టిబాబు, బాబు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికలు నిర్వహించే అధికారం లేదు'

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ది నెల్లూరు జర్నలిస్ట్స్ పరస్పర సహాయక సహకార గృహ నిర్మాణ లిమిటెడ్ కమిటీ కోసం ఎన్నికలను ఆదివారం నిర్వహించేందుకు కొందరు యత్నిస్తున్నారని, వీరికి ఎలాంటి అధికారం లేదని డీసీఓ తిరుపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించతలపెట్టిన ఈ ఎన్నికలకు ఎలాంటి గుర్తింపు ఉండబోదని స్పష్టం చేశారు. ధిక్కరించి ఎన్నికలను నిర్వహిస్తే చర్యలు తప్పవని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతీ పూజ



నెల్లూరు రూరల్: ధనలక్ష్మీపురంలోని జెడ్పీ హైస్కూల్లో సరస్వతీ పూజను శుక్రవారం నిర్వహించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. సర్వశిక్ష పీఓ ఉషారాణి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత వేణుగోపాల్‌రెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ హనుమంతరెడ్డి, కమిటీ మాజీ చైర్మన్ ఓబుల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు గిరిధర్‌సింగ్, మల్లి, తదితరులు పాల్గొన్నారు.

రమేష్‌బాబుకు అవార్డు



నెల్లూరు (అర్బన్): అమ్మా యూత్ ఫౌండేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబుకు నేషనల్ బెస్ట్ సర్వీస్ అవార్డును విశ్వంబర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. నగరంలోని ప్రకాష్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును ట్రస్ట్ అధ్యక్షురాలు సువర్ణకుమారి ప్రదానం చేశారు. ఆయుష్ జిల్లా మెడికల్ ఆఫీసర్ గోవిందయ్య, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దు



నెల్లూరు (అర్బన్): బోయ, వాల్మీకి, తదితరులను ఎస్టీ జాబితాలో చేర్చొద్దంటూ గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శనను శుక్రవారం చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రాన్ని నేతలు అందజేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ పెంచలయ్య, నేతలు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, రవి, శ్రీనివాసరావు, సతీష్‌చంద్ర, మురళి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న సురేష్‌బాబు

నెల్లూరు (అర్బన్): సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్‌పై అవగాహన సదస్సును నగరంలోని డీకే డబ్ల్యూ కళాశాలలో జిల్లా యువజన సంక్షేమ శాఖ – సెట్నెల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సైబర్ అనాలసిస్ వింగ్‌కు చెందిన ఎస్సై సురేష్‌బాబు, సెట్నెల్ సీఈఓ పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.


స్పాల ముసుగులో అసాంఘిక కార్యకలాపాలు



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

నెల్లూరు సిటీ: కొందరు వ్యక్తులు స్పా సెంటర్ల ముసుగులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుండగా, పోలీసులు దాడులు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. నగరానికి చెందిన ఓ ఏఎస్సై కుమారుడు మహేష్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన కృష్ణ స్నేహితులు. మాగుంట లేఅవుట్, రామ్మూర్తినగర్‌లో బ్యూటీ పార్లర్ అండ్ స్పా సెంటర్లను నిర్వహిస్తున్నారు. ముంబై, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, విజయవాడ, బళ్లారి, తదితర ప్రాంతాల నుంచి యువతులను తీసుకొచ్చి, వీరితో మసాజ్‌తో పాటు అసాంఘిక కార్యకలాపాలను చేయించేవారు. సమాచారం అందుకున్న ఎస్పీ విజయారావు సూచనల మేరకు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఐడీ పార్టీ సిబ్బంది నిఘాను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో డీఎస్పీ తన బృందంతో కలిసి రెండు స్పా సెంటర్లపై దాడులు చేశారు. మాగుంట లేఅవుట్లోని స్పాలో మేనేజర్‌గా అలంకార్ సెంటర్‌కు చెందిన సుదీప్, ఢిల్లీకి చెందిన ఓ యువకుడు రిసెప్షనిస్ట్‌గా పనిచేయడాన్ని పోలీసులు గుర్తించారు. స్పా సెంటర్‌లోని నలుగురు యువతులను అదుపులోకి తీసుకొని దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రామ్మూర్తినగర్‌లోని బ్రాంచ్‌లో మేనేజర్‌గా కొడవలూరు మండలం రేగడిచెలికకు చెందిన విజయ్ పనిచేస్తున్నారని పోలీసులు గుర్తించారు. అక్కడ ఓ యువతిని అదుపులోకి తీసుకొని బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. చిల్డ్రన్స్‌పార్క్ సెంటర్‌లోని స్పాలో కలిగిరి మండలానికి చెందిన మంజునాథ మేనేజర్‌గా పనిచేస్తున్నారని గుర్తించారు. ఇక్కడ ముగ్గురు యువతులను అదుపులోకి తీసుకొని బాలాజీనగర్‌కు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిర్వాహకుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. దర్గామిట్ట, బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్లు సీతారామయ్య, రాములునాయక్ పాల్గొన్నారు.

అధిక శబ్ద కాలుష్యానికి పాల్పడితే చర్యలు



నెల్లూరు సిటీ: అధిక శబ్దం చేసే సైలెన్సర్లను వినియోగిస్తే ఉపేక్షించబోమని, వాహనాలను సీజ్ చేయడంతో పాటు వాహనదారులపై కేసులు నమోదు చేస్తామని ఏఎస్పీ ప్రసాద్ హెచ్చరించారు. నగరంలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించి అధిక శబ్దం చేసే సైలెన్సర్లను వినియోగించిన 420 వాహనాలను గుర్తించి తొలగించారు. వీటిని మాగుంట లేఅవుట్లోని అవుట్‌పోస్ట్ వద్ద జేసీబీతో తొక్కించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు చేపడతామని చెప్పారు. అధిక శబ్దం చేసే సైలెన్సర్లను విక్రయిస్తున్న దుకాణ యజమానులు, వాటిని బిగిస్తున్న మెకానిక్‌లపైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుబాన్, నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరమ్మ, సౌత్ ట్రాఫిక్ ఆర్ఐ రమణారెడ్డి, ఎస్సై రంగనాథగౌడ్, గీతారమ్య, ఆర్ఎస్సైలు చంద్రమౌళి, తిరుమలరెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మైపాడు రోడ్డులో స్తంభాల ఏర్పాటు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని ఈస్ట్ – 1 ఏఈ మన్మథరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైపాడు రోడ్డులోని పాత చెక్‌పోస్ట్ నుంచి పత్తివారి సత్రం వరకు ఉదయం ఎనిమిది నుంచి 12 వరకు, తిరిగి మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

• ఎంజీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ నీలగిరి సంఘం ఫీడర్‌లో విద్యుత్ టవర్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో లక్ష్మీనరసింహపురం, రామాలయం వీధి, బారాషహీద్ దర్గా, నెల్లూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయం, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని ఏఈ సెక్షన్ ఏఈ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తవెల్లంటి, పాతవెల్లంటి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో మహిళలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని వివరించారు. కొత్తవెల్లంటిలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, రోడ్డు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీ నిధులు రూ.25 లక్షలను ఈ ప్రాంతానికి మంజూరు చేయనున్నానని తెలిపారు.

ఎమ్మెల్యే కోటంరెడ్డి ఆగడాలకు చెల్లు

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆగడాలకు కాలం చెల్లిందని డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ మండలంలోని పలు ప్రాంతాల అభివృద్ధికి జెడ్పీ నిధులు రూ.రెండు కోట్లను కేటాయించగా, సదరు పనులను ఆయన అడ్డుకున్నారని ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం గతంలో తన వద్దకు లేదా ఎంపీ ఆదాల వద్దకు ఎవరైనా వెళ్తే వారిని కోటంరెడ్డి సోదరులు ఇబ్బందులు పెట్టేవారని తెలిపారు. ప్రజాధనాన్ని కొల్లగొట్టిన ఘనత వారికే దక్కుతుందని ధ్వజమెత్తారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, రూరల్ ఎంపీపీ విజయ్‌కుమార్, వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన చైర్మన్ సురేంద్రరెడ్డి, నేతలు ప్రభాకర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, రామ్‌ప్రసాద్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట

• ఎస్పీ విజయారావు



మాట్లాడుతున్న విజయారావు

నెల్లూరు సిటీ: జిల్లాలోని పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని ఎస్పీ విజయారావు పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డేను శుక్రవారం నిర్వహించారు. అర్జీలను స్వీకరించి.. వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను ఎస్పీ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. వృత్తి, ఆరోగ్యపరమైన సమస్యలకు సంబంధించిన అర్జీలపై సత్వరమే స్పందించి తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

ముగిసిన టీ – 20 క్రికెట్ పోటీలు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల పాటు నిర్వహించిన టీ – 20 క్రికెట్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. బుజబుజనెల్లూరులోని సీఎంఏ, ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో జిల్లాలోని వివిధ క్లబ్‌లకు చెందిన 50 జట్లు పోటీపడ్డాయి. ఏఎల్ఎమ్సీసీ, లార్డ్స్ సీసీ జట్ల మధ్య ఫైనల్స్ జరగ్గా, ఏఎల్ఎమ్సీసీ జట్టు విజయం సాధించింది. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ యతిరాజ్ బహుమతులను అందజేశారు. క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి నిఖిలేశ్వర్‌రెడ్డి, కోశాధికారి అబూబకర్, సంయుక్త కోశాధికారి మునిగిరీష్, మాజీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరప్రసాద్ సేవలు భేష్



సత్కరిస్తున్న ఉద్యోగులు

నెల్లూరు (అర్బన్): జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరప్రసాద్ సేవలు ఎనలేనివని డివిజనల్ పీఆర్వో రమేష్ పేర్కొన్నారు. మచిలీపట్నం జిల్లా డీడీగా బదిలీ అయిన వెంకటేశ్వరప్రసాద్‌ను డీపీఆర్వో కార్యాలయంలో సిబ్బంది, అధికారులు శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడారు. విధుల్లో ఎక్కడా రాజీపడలేదని, కలెక్టర్‌తో పాటు ఇతర అధికారుల మన్ననలను పొందారని చెప్పారు. ఏఈఐఈ కిషోర్, ఏపీఆర్వో రవీంద్ర, పీఆర్వో వినోద్‌కుమార్, సీనియర్ సహాయకులు సుబ్బమ్మ, సువర్ణ, ఫరీద్, ఫొటోగ్రాఫర్లు శివరామ్‌ప్రసాద్, గురుప్రసాద్, వీడియోగ్రాఫర్లు సాయినాథ్, అరుణ్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలి



కలెక్టరేట్ వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన

నెల్లూరు (అర్బన్): ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత పెంచలయ్య, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట పలువురు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు నిరసనను శుక్రవారం చేపట్టారు. అనంతరం కలెక్టరేట్లోకి వెళ్లేందుకు యత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో గేట్‌కు వినతిపత్రాన్ని తగిలించారు.

విశేషాలంకారాల్లో శ్రీరామచంద్రుడి దర్శనం





నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని త్యాగరాజస్వామి మందిరంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు, షిర్డీ సాయినాథ జన్మదినోత్సవాలను విశేషంగా నిర్వహిస్తున్నారు. శ్రీరామచంద్రుడు శేషవాహన సేవలో శుక్రవారం దర్శనమిచ్చారు. తిరుమంజనం, ఊంజల్‌సేవ, పల్లకిసేవ, తదితరాలను జరిపారు. దివ్యసింధు నృత్య ప్రదర్శన అలరించింది. ఉభయకర్తలుగా మస్తానయ్య, కృష్ణవేణి, మహిధర్, అర్చన దంపతులు వ్యవహరించారు. వెంకటరమణశర్మ, త్యాగరాజ మందిర నిర్వాహక కమిటీ ధర్మకర్త చైతన్యకుమార్, తదితరులు పాల్గొన్నారు.

• సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో స్వామివారు సింహవాహనంపై దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా నాగ సతీష్, భానుమతి దంపతులు వ్యవహరించారు. ఈఓ దర్గయ్య, మహేష్ పర్యవేక్షించారు.

హంసవాహనంపై అనంత కోదండరాముడు



నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో సీతారామ, లక్ష్మణ, హనుమత్ సమేత అనంత కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణ, నిత్యహోమాన్ని భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. అనంతరం కొడిముద్దల ప్రసాద వితరణ, పూలంగి సేవ, హంసవాహనసేవను జరిపారు. ఉభయకర్తలుగా కుమారస్వామి, సునీత దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లుగుప్తా, వెంకటరత్నం, కోశాధికారి మస్తాన్‌రావు, తదితరులు పర్యవేక్షించారు.